క్లుప్తంగా

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



ఆర్చరీ శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ప్రతినిధులు

అరసవల్లి: అరసవల్లిలో ఆదిత్య ఆర్చరీ అకాడమీ వేసవి శిక్షణా శిబిరాన్ని గురువారం ప్రారంభించినట్లు అకాడమీ డైరెక్టర్ చెటికం రాజ్‌కుమార్ తెలిపారు. విలువిద్యలో ప్రావీణ్యత సాధిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. వేసవి సెలవుల్లో టీవీలు, సెల్‌ఫోన్లకు అతుక్కుపోకుండా ఇలాంటి వేసవి శిక్షణ శిబిరాల్లో చేర్పించడం మంచిదన్నారు. అకాడమీ తరపున ఇప్పటివరకు 17 మంది రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆర్చరీ అసోసియేషన్ సెక్రటరీ ఎల్.చిట్టిబాబు, ఒలింపిక్ అసోషియేషన్ జనరల్ సెక్రటరీ ఎం.సాంబమూర్తి, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘ అధ్యక్షుడు ఎం.వి.రమణ, ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.వి.రమణ, మాస్టర్ అథ్లెటిక్స్ అసోషియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ చల్లా జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

షిర్డీసాయికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బొందిలీపురం దర్బార్ షిరిడీసాయి బాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు సంతోష్ బ్రహ్మ, సురేష్ బ్రహ్మల ఆధ్వర్యంలో స్వామివారికి మూడు హారతులు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.

భగవద్గీతను పఠించాలి



శ్లోకాలు నేర్చుకుంటున్న విద్యార్థులు

గార: దేవుడు చెప్పిన గ్రంథం భగవద్గీతను అందరూ చదవాల్సిన పుస్తకమని గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ గురువులు ఎన్.త్రినాథ్, జి.సత్యనారాయణ అన్నారు. శిమ్మపేట శివాలయం వద్ద భగవద్గీత, అన్నమాచార్య సంకీర్తనలపై గ్రామస్తులు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు అవగాహన, శ్లోకం, భజన గీతాలు నేర్పారు.

సజావుగా గురుకుల ప్రవేశ పరీక్ష

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి శ్రీకాకుళం పట్టణంలోని కేంద్రాల్లో గురువారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు కో–ఆర్డినేటర్, ఎస్ఎంపురం ఏపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శివప్రసాద్ తెలిపారు. ఉదయం నిర్వహించిన ఐదో తరగతి పరీక్షకు ఏడు కేంద్రాల్లో 2384 మంది హాజరు కాగా, మధ్యాహ్నం నిర్వహించిన జూనియర్ కళాశాల పరీక్షకు 25 కేంద్రాల్లో 5393 మంది హాజరైనట్లు వివరించారు. డీఈవో వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమం



ప్రచారం నిర్వహిస్తున్న ధర్మాన గజలక్ష్మి

శ్రీకాకుళం రూరల్ : భవిష్యత్తు తరాలు బాగుండాలంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని మంత్రి ధర్మాన ప్రసాదరావు సతీమణి గజలక్ష్మి పిలుపునిచ్చారు. గురువారం శిలగాం సింగువలసలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో శ్రీకాకుళం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. టీడీపీని నమ్మవద్దని కోరారు. కార్యక్రమంలో అభిమానులు, పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ప్రవీణ్ ప్రతిభ



ప్రవీణ్ జగదీష్

శ్రీకాకుళం క్రైమ్ : జేఈఈ మెయిన్స్ ఫేజ్–2 ఫలితాల్లో శ్రీకాకుళానికి చెందిన వై.ప్రవీణ్ జగదీష్ ప్రతిభ కనబర్చాడు. తాజాగా వెలువడిన ఫలితాల్లో 99.89 పర్సంటైల్‌తో 1879వ ర్యాంకు సాధించి సత్తాచాటాడు. జగదీష్ తల్లిదండ్రులు వై.వాసుదేవరావు, దేవారాణిలు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.

సకల సౌకర్యాలు.. చక్కని చదువులు

- నాడు–నేడుతో మారిన సర్కారు బడుల రూపురేఖలు
- ప్రైవేటుకు దీటుగా ఫలితాలు



ఎచ్చెర్ల: ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాల అంటే పెచ్చులూడుతున్న పైకప్పులు.. బీటలు వారిన గోడలు.. ప్రహరీ లేని పాడుబడిన భవనాలు.. నేల చదువులతో దర్శనమిచ్చేవి. నిరుపేదలు తప్ప ఎవరూ ఆ బడుల వైపు చూసేవారు కాదు. మరికొన్ని చోట్ల రాత్రయితే అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను సమూలంగా మార్చేశారు. మనబడి నాడు–నేడు పథకంలో భాగంగా అదనపు భవనాలు, తరగతి గదుల మరమ్మతులు, ఆహ్లాదకర రంగులు, బెంచీలు డెస్కులు, టైల్స్, పచ్చదనం, డిజిటల్ బోర్డులు, శుద్ధజలం, మరుగుదొడ్లు.. ఇలా ఒకటేమిటి సకల సౌకర్యాలూ కల్పించారు. చిన్నారుల మనసు దోచేలా సర్కారు బడులను తీర్చిదిద్దారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో సైతం ప్రైవేటుకు దీటుగా ఫలితాలు సాధించడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఎచ్చెర్ల మండలంలో 14 జిల్లా పరిషత్, 5 ప్రాథమికోన్నత, 82 ప్రాథమిక, మూడు గురుకుల పాఠశాలలు, ఆదర్శ పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం ఉన్నాయి. 11,809 మంది విద్యార్థులు చదువుతుండగా 487 మంది ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు.



అల్లినగరంలో డిజిటల్ బోర్డుపై పాఠాలు నేర్చుకుంటున్న విద్యార్థులు(ఫైల్)



చిన్న కొంగరాం ప్రాథమిక పాఠశాల



సకల సౌకర్యాలతో కుశాలపురం ప్రాథమిక పాఠశాల



అల్లినగరంలో పౌష్టికాహారం తింటున్న విద్యార్థులు(ఫైల్)



కొత్త ఫర్నిచర్‌పై కూర్చుని చదువుకుంటున్న విద్యార్థులు(ఫైల్)

కంట్రోల్ రూమ్ పరిశీలన



రూమ్‌ని పరిశీలిస్తున్న పరిశీలకుడు సందీప్‌కుమార్

శ్రీకాకుళం పాతబస్టాండ్: నూతన కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం శాసన సభ నియోజకవర్గాల జనరల్ అబ్జర్వర్ సందీప్‌కుమార్ గురువారం పరిశీలించారు. కంట్రోల్ రూంలో మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ, సోషల్ మీడియా, కంప్లయింట్ మానిటరింగ్ సెల్, సి–విజిల్స్ టీం, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, పోస్టల్ బ్యాలెట్, ఎన్నికల వ్యయం, ఎక్సైజ్ కంట్రోల్ రూం, పోలీస్ కంట్రోల్ రూం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కంట్రోల్ రూమ్ ఇన్‌చార్జి టి.వెంకటేశ్వరరావు, నోడల్ అధికారులు కె.చెన్నకేశవరావు, ఎం.గణపతిరావు, ఆర్.శ్రీనివాసరావు, కిరణ్‌కుమార్, లక్ష్మీప్రసన్న, వాసుదేవరావు, ప్రసాదరావు, చిట్టిరాజు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎంగా చేద్దాం



కుమ్మరి కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తంను సన్మానిస్తున్న సంఘ నాయకులు

రణస్థలం: శాలివాహన కుమ్మరుల సంక్షేమానికి కృషి చేసిన సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని ఏపీ శాలివాహన కుమ్మరి కార్పొరేషన్ చైర్మన్ ఎం.పురుషోత్తం పిలుపునిచ్చారు. మండల కేంద్రం రణస్థలంలో గురువారం కుమ్మరి కులస్తుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆరు లక్షల మంది కుమ్మర్లకు రూ.1,680 కోట్ల మేర లబ్ధి చేకూరిందన్నారు. శాలివాహన కుమ్మరులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి గుర్తింపు ఇచ్చారన్నారు. అనంతరం పురుషోత్తంను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శాలివాహన సంఘ నాయకులు నాగవరపు సత్యం, యు.రామారావు, యు.గొల్ల, వి.లక్ష్మణరావు, వి.రమేష్, రమణ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు శరత్‌బాబు

శ్రీకాకుళం కల్చరల్ : కేంద్రీయ విశ్వవిద్యాలయం(హైదరాబాద్), తెలుగు భాషా శాస్త్రజ్ఞుల వేదిక, అనువర్తిత భాషా శాస్త్రం, అనువాద అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో జరిగే రెండు రోజుల అంతర్జాతీయ సదస్సుకు పట్టణానికి చెందిన జంధ్యాల శరత్‌బాబుకు ఆహ్వానం అందింది. 'పత్రికలే తెలుగు దనానికి ప్రతీకలు' అనే అంశంపై పంపిన పరిశోధన పత్రం ఎంపికైనట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 11.30 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని ఒకప్రకటనలో తెలిపారు.

మలేరియా వ్యాప్తిని అరికడదాం



ర్యాలీలో మాట్లాడుతున్న డీపీఎం లింగరాజు



వాంబే కాలనీ వద్ద కాలువలో ద్రావణం పిచికారీ చేయించిన లయన్స్‌క్లబ్ ప్రతినిధులు



పొన్నాడలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

అరసవల్లి: ప్రపంచ మలేరియా నివారణా దినోత్సవం సందర్భంగా గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా మలేరియా నియంత్రణాధికారి డాక్టర్ పి.వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో అర్బన్ డీపీఎం డాక్టర్ పి.లింగరాజు తదితరుల సమక్షంలో వివిధ విభాగాల సిబ్బంది, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొని మలేరియా లక్షణాలను వివరించారు. దోమకాటుతో మలేరియా వస్తుందని, చలి, వణుకుతో కూడిన జ్వరమే మొదటి లక్షణమని చెప్పారు. వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మలేరియా విభాగాధికారులు సత్యనారాయణ, శ్రీకాంత్, మాస్‌మీడియా అధికారి వెంకటరమణ పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: ప్రపంచవ్యాప్తంగా ప్రజల ఆరోగ్యం, జీవితాలను ప్రభావితం చేసే సమస్య మలేరియా అని, దీనిని సమష్టిగా అరికడదామని శ్రీకాకుళం నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ వెంకటరావు అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం శ్రీకాకుళం వాంబే కాలనీలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో కాలువలు క్లీనింగ్ చేసి ద్రావణం పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియాను అరికట్టేందుకు స్వచ్ఛంద సంస్థలు ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్, మెంటార్ నటుకుల మోహన్, డాక్టర్ బొడ్డేపల్లి సురేష్, వైస్ ప్రెసిడెంట్ బి.విశ్వేశ్వరరావు, ఆరోగ్య సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: మండలంలోని పొన్నాడ గ్రామంలో మలేరియాపై అవగాహన సదస్సు నిర్వహించారు. పొన్నాడ ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఎస్.శేషగిరి, డాక్టర్ సౌమ్య, ఆరోగ్య విస్తరణాధికారి జగన్నాథరావు ఆధ్వర్యంలో ర్యాలీను నిర్వహించి వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది గండేపల్లి సుధ, ఎం.డేవిడ్‌రాజు, డీఎల్ఆర్ మేరీ, హెల్త్ అసిస్టెంట్ ఇప్పిలి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ కేంద్రాల పరిశీలన



పోలీసుల అధికారులకు సూచనలిస్తున్న ఎన్నికలు పరిశీలకులు

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు, శ్రీకాకుళం పార్లమెంటరీ స్థానానికి సంబంధించి చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఈవీఎంలు భద్రపర్చే స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రాలను ఎన్నికల పరిశీలకుడు తలత్ పర్వజ్ ఇక్బాల్, ఎలక్షన్ పోలీస్ అబ్జర్వర్ దిగంబర్ పి.ప్రవీణ్, పోలీస్ అబ్జర్వర్ సచీంద్ర పటేల్‌తో కూడిన బృందం గురువారం పరిశీలించింది. ఎస్పీ జీఆర్ రాధికతో కూడిన పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. గదుల్లో ఏర్పాట్లు, భద్రతా చర్యలపై చర్చించారు. పూర్తిస్థాయిలో ఈవీఎంలకు భద్రత ఉండాలని సూచించారు. కౌంటింగ్ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

త్రైత సిద్ధాంత క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండర్ (త్రైతశకం–4)లను శ్రీకాకుళం జెడ్‌పీపీఎఫ్ సిబ్బంది గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రబోధానంద యోగేశ్వర స్వామి రచించిన ఈ తెలుగు కాలసూచికలో భగవద్గీత వచనాలను జోడించి సరళమైన భాషలో అర్థమయ్యేలా రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక సత్రం కమిటీ అధ్యక్షులు, సభ్యులు గుండ జనార్దనరావు, గుండ లక్ష్మీ కుమారి, కూన సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ విజేతలకు అభినందనలు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం నారాయణ ఐఐటీ క్యాంపస్ విద్యార్థులు ఇటీవల జరిగిన జేఈఈ మెయిన్స్–2024 ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 15 మంది విద్యార్థులు 10వేల లోపు ర్యాంక్‌లు సాధించినట్లు ప్రిన్సిపాల్ పి.ప్రసన్నకుమార్, డీన్ ఆర్.మణికుమార్, ఏజీఎం బి.తిరుపతిరావు తెలిపారు. చింతు సతీష్ కుమార్ ఓపెన్ కేటగిరిలో 8వ ర్యాంక్, కేటగిరీ ర్యాంక్‌లో 2వ స్థానం, ఎస్.సాయిబదరీష్ ఓపెన్ కేటగిరిలో 1112వ ర్యాంక్, కేటగిరీ ర్యాంక్‌లో 129వ స్థానం, ఎస్.సాయి వెంకట మణి భావన ఓపెన్ కేటగిరీలో 1740వ ర్యాంక్, కేటగిరీ ర్యాంక్‌లో 301వ స్థానం, ఎం.అమీషా ఓపెన్ కేటగిరీలో 1945వ ర్యాంక్, కేటగిరీ ర్యాంక్‌లో 243వ స్థానం, జి.గుణశేఖర్ ఓపెన్ కేటగిరిలో 3485వ ర్యాంక్, కేటగిరీ ర్యాంక్‌లో 452వ స్థానం సాధించినట్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను గురువారం అభినందించారు.

వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించండి



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



జి.సిగడాం: చెట్టుపొదిలాంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల: రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ కోరారు. గురువారం లావేరు మండలం బుడతవలస, గుమడాం పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటా ప్రచారం చేపట్టి వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని కోరారు. గ్రామాల్లోకి ప్రచారాలకు వెళ్తున్నప్పుడు దారిలో కలిసిన ఉపాధి వేతనదారులతో మాట్లాడి సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యులు మీసాల సీతంనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు దన్నాన రాజీనాయుడు, జేసీఎస్ ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బూరాడ చిన్నారావు, బొంతు సూర్యనారాయణ, వైస్ ఎంపీపీలు లుకలాపు శ్రీను, అలువన రమణమ్మ, స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీ నాయకులు బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జి.సిగడాం: పేదల సంక్షేమం కోసం పనిచేసే పార్టీ వైఎస్సార్ సీపీ అని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. గురువారం చెట్టుపొదిలాం, మధుపాం, నల్లిపేట, కప్పరాం, ఎస్‌పీఆర్‌పురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జగనన్న మళ్లీ అధికారంలోకి వస్తే సంక్షేమ ఫలాలు మళ్లీ మీ ఇంటి వద్దకే అందుతాయని భరోసా ఇచ్చారు. చంద్రబాబును గెలిపిస్తే పథకాలు ఆగిపోయే ప్రమాదముందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మీసాల నీలకంఠంనాయుడు, సర్పంచ్‌లు భూపతి సురేష్‌కుమార్, కంది రమాదేవి, నల్లి తవిటినాయుడు, వైస్ ఎంపీపీలు మీసాల సాధ్వీమణి, తోలేటి వెంకటరావు, ఎంపీటీసీ పట్నాన శాంతి, జెడ్పీటీసీ కాయల రమణ తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేశాం



ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

గార: గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలుచేశామని, అందుకే ప్రజల వద్దకు ధైర్యంగా వెళ్లి ఓట్లు అడగ గలుగుతున్నామని వైఎస్సార్ సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు అన్నారు. గురువారం గార మండలం కె.మత్స్యలేశం, కొర్లాం, అంబళ్లవలస పంచాయతీల్లో ఉపాధి హామీ వేతనదారులతో మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి ధర్మాన ప్రసాదరావు హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. గత ప్రభుత్వంలా జన్మభూమి కమిటీలు ఏర్పాటు చేసి వారి బంధువులు, పార్టీ జెండా కట్టేవారికే సంక్షేమ పథకాలు అమలు చేయడం ఈ ఐదేళ్లలో జరగలేదన్నారు. అర్హులందరికీ పథకాలు అందించామన్నారు. వలంటీర్ల ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్, బియ్యం ఇంటివద్దకే ఇచ్చామని చెప్పారు. కరోనా వంటి పరిస్థితుల్లో అన్ని రాష్ట్రాల కంటే ఉత్తమంగా సేవలందించినట్లు గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురామ్, పీస శ్రీహరిరావు, బి.ఎర్రన్న, ముంజేటి కృష్ణమూర్తి, యాళ్ల నారాయణమూర్తి, శిమ్మ ధర్మరాజు, బత్తుల గోవిందరావు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగం సామాజిక బాధ్యత



ఓటు హక్కు ప్రతిజ్ఞలో పాల్గొన్న వైస్ చాన్సలర్ రజిని తదితరులు

ఎచ్చెర్ల క్యాంపస్: 18 ఏళ్లు దాటిన వారు సామాజిక బాధ్యతగా ఓటు హక్కు వినియోగించుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజిని పిలుపునిచ్చారు. ఓటు విద్య–ఎన్నికల వ్యవస్థలో భాగస్వామ్యం అన్న అంశంపై కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, వర్సిటీలోని ఎంజేఎంసీ విభాగం ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని చెప్పారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆంధ్రా ప్రాంత అదనపు డైరెక్టర్ జనరల్ రాజేంద్ర చౌదరి మాట్లాడుతూ దేశ భవిష్యత్తును నిర్ణయించే ప్రజాస్వామ్యం విజయవంతంగా కావాలంటే ఓటు హక్కు కీలకమని చెప్పారు. అనంతరం వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



శ్రీరామమూర్తిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

జి.సిగడాం: వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ ఉపాధ్యక్షుడు, సీనియర్ నాయకులు పేడాడ శ్రీరామమూర్తి ఇటీవల గుండె సంబంధిత చికిత్స చేయించుకోవడంతో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు బత్తుల సన్యాసిరావు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మక్క వెంకటిసాయి, సర్పంచ్‌లు వడిశ మహేశ్వరరావు, చిత్తిరి మోహన్ శుక్రవారం ధవళపేటలో పరామర్శించారు. కార్యక్రమంలో మండల ఎన్నికల ఇన్‌చార్జి బూరాడ చిన్నారావు, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ పేడాడ శ్యామలరావు, చందనాల రంగారావు, కృష్ణంరాజు పాల్గొన్నారు.

ఎన్నికల పరిశీలకులను కలిసిన ఎస్పీ



సచ్చింద్రపటేల్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ :

ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు విచ్చేసిన ఎన్నికల పరిశీలకులను ఎస్పీ జి.ఆర్.రాధిక గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు. ఎన్నికల నిర్వహణపై చర్చించారు. ఎస్పీ కలిసిన వారిలో జిల్లా ఎన్నికల పోలీసు పరిశీలకులు, సీనియర్ ఐపీఎస్ అధికారి దిగంబర్ పి.ప్రదాన్ (మహారాష్ట్ర), ఎచ్చెర్ల నియోజకవర్గ పరిశీలకులు సచ్చింద్ర పటేల్, జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు, సీనియర్ ఐఏఎస్ అధికారి శేఖర్ విద్యార్థి (హర్యానా) ఉన్నారు.

పక్కాగా వేసవి సెలవులు అమలు

శ్రీకాకుళం: రాష్ట్రంతో పాటు జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు, ఇంటర్మీడియెట్ కళాశాలలు ప్రభుత్వ నిబంధనల మేరకు వేసవి సెలవులు పక్కాగా అమలు చేయాల్సిందేనని, విరుద్ధంగా వ్యవహరించే యాజమాన్యాలపై చర్యలు తప్పవని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొన్ని కళాశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు ఫిర్యాదులు అందుతున్నాయని, అటువంటి వాటిని గుర్తించేందుకు ప్రత్యేక కమిటీలు వేయాలని సూచించినట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే గుర్తింపు రద్దుతో పాటు చర్యలు తప్పవని హెచ్చరించారు.

